రోడ్డు రోలరు — ఇంజను —

తిప్పావఝ్ఝల వెంకట్రామయ్య

విశాల గదిలో బల్లమీద బోర్లాపడుకుని చిలిపితనం చిలికే తన విశాల వినీల నయనాల్లో కిటికీగుండా వీధిలో వచ్చే పొయ్యే బండ్లవైపు చూస్తోంది. పొడుగాటి తెగ బారెడు నల్లని జడ జడకుచ్చుల బరువుకు బల్లమీదినుండి జారి నేలను తాకుతోంది. రాత్రి పడుకోబోయేప్పుడు తీసి నీళ్ళల్లో పెట్టి ఉదయమే పెట్టుకున్న విరబూసిన మల్లెలు జడలోంచి జీరాడుతూ గుప్పున వాసనలు వెదజల్లుతున్నయ్. కొద్దిగా పైకెత్తిన పాదాల మీంచి క్రిందికిజారిన పసుపు పచ్చని పట్టుపరికిణీ ఆమె శరీరకాంతితో పోటీ చేయలేక వెలవెలపోతోంది. క్రిందికి జీరాడుతున్న ఆమె నైలాన్ పమిటతో బాబు బూచాట ఆడుకొంటున్నాడు. దిద్దించిన అక్షరాలు చెరిపేసి వరసాగ్గా పలకమీద సున్నాలు పెడుతున్నాడు నాలుగేళ్ల రవి. గోపీ కూనిరాగాలు తీస్తూ లెక్కలు చేస్తున్నాడు.

ఇవేవీ గమనించకుండా విశాల ప్రొద్దున జరిగిన సంఘటన్ను గురించే ఆలోచిస్తోంది. అందులో తన తప్పేమిటో ఎంతకూ అర్థమవటంలేదామెకు. ప్రొద్దున్నే అమ్మ కాఫీ పెట్టమంటే పెట్టింది తను. పిల్లలంతా వచ్చారు. వరసగా లోటాల్లోపోసి ఒక్కొక్కరికిస్తోంది తను. తనకు ముందివ్వలేదని రవి అలిగి వెళ్లిపోయాడు. తనకు కొంచెమేనని రవణ లోటా ఎత్తి దిమ్మరించాడు. 'పోరా! వెధవా ఈరోజు నీకు కాఫీలేదు పొమ్మ'ని వాణ్ణి గదిమి రవిని బ్రతిమాలి పిల్చుకొచ్చేసరికి 'నా లోటాతో, గోపీ కెందు కిచ్చావ్! నేను త్రాగను పో!' అని వాడు క్రిందబడి దొర్లడం సాగించేశు. వాణ్ణి రెండంటించేసరికి వాడు గోల ప్రారంభించేడు. ఈలోపల బాబు పోయి గిన్నెడు కాఫీ దొర్లించేసేడు. రవణ పోయి పిర్యాదు చేశాడేమో, పెరట్లో

రోడ్డు రోలరు – ఇంజను –

పనిచేసుకుంటున్న అమ్మ వచ్చింది. వచ్చి చూచింది. తప్పంతా తనదే ఐనట్టు తన్ను తిట్టింది. తన కేమీ పని చేతగాదట. పిల్లల్ని చెండుకుతింటానట. తనకూ మండిపోయింది. తన్ను తిట్టినందుకుగాదు. అలా పిల్లల్ని వెనకేసుకువచ్చినందుకు. అమ్మ రెండంటే బదులు నాలుగంది తను. అమ్మకు కోపమొచ్చి చెయ్యెత్తి కొట్టబోతే చేయి విదిలించేసి వచ్చి అలిగి పడుకొంది.

'ఛీ – వెధవ పిల్లలు! మరీ హద్దూ పద్దూ లేకుండా ఆడుతున్నారు. తనైతే ఇలాగే పెంచేదా! అమ్మనయితే చెవులుపట్టి ఆడిస్తారు గాని నాన్న ఇంటికొస్తే సరి కుక్కిన పేనుల్లా పడుంటారు. ఇంతకూ వాళ్ళ ననుకొని ఏం ప్రయోజనం! అమ్మ అలుసు చూసుకొనిగదా వాళ్ళట్లా ఆడేది! ఏమన్నా అనక ముందే వాళ్లను వెనకేసుకొస్తుందాయెను! ఏమిటో మరి తాను నాన్నకు ముద్దుల కూతుగట, తనమీద ఈగ వాలనీడట నాన్న! ఇలాగైతే ఐనట్లే అంటుంది అమ్మ. ఇంతకూ తన చదువు చేసిందంటుంది. ఆమె పిచ్చిగాని తన చదువేమి చేసిందో...' ఇలా సాగిపోతున్న విశాల ఆలోచనలకు బ్రేకు పడింది.

'అక్కయ్యా! ఈ లెక్కలా చెయ్యాలో చెప్పవే!' అంటూ గోపీ లేచివచ్చాడు. 'పోరా! పో, వెధవ లెక్కలూ నువ్వూ.' అని కసిరికొట్టింది విశాల. 'అమ్మా! అక్కయ్యను లెక్కడిగితే చెప్పలేదేవ్?' అని వాడొక్క గావుకేక పెట్టేడు. విశాలకు ఒళ్ళు మండింది. లేచి వాడి నెత్తిన ఒక్కటి అంటించింది, 'వెధవా, నోరు మూసుకో'మని. వాడు కేకలు వేయబోతే నోరు మూసింది. వాడు కప్పెగిరిపోయేట్టు ఏడుస్తూ గోల చేయడం సాగించేడు, వాకిటవంక చూస్తూ.

ఇంతలో అమ్మ వస్తున్న శబ్దం కానే ఐంది. విశాల గుట్టుగాపోయి బల్లమీద పడుకుంది, సరోష నయనాల్తో. అవైపు ముఖముంచుకొంది. పార్వతమ్మ రాగానే ప్రారంభించింది. 'ఏమిరా! ఏమి ముంచుకుపోయిందిరా అలా గోలచేస్తావ్!...అబ్బబ్బ! ఈ స్కూళ్ళకు సెలవులైతే ఇచ్చేరుగాని నా దుంప తెగిపోతోంది బాబూ! ఇంతకూ ఏమి జరిగిందిరా, గోపీ!' అని ప్రశ్నించింది. గోపీ ఏడుపు మానలేదు. నాలుగేళ్ళ రవి అందుకున్నాడు.

'మరేం! అక్కయ్య, గోపి గొంతు పిసికిందేవ్!' అంటూ–వింటూ పడుకున్న విశాల ఒక్క ఉదుటున లేచి వాణ్ని నెత్తిన మొట్టింది. 'ఎప్పుడురా నేను గొంతు పిసికింది!' అంటూ 'అయ్యో, అయ్యో, నా ఎదుట్నే అలా పసివాణ్ని చావగొట్టున్నావే, ఇంక నే లేనప్పుడు కొట్టటం అబ్బురమటే! ఐనా అడ్డమైన చాకిరీ చేస్తున్నాగదా! పెద్దపిల్లవు, చిన్నవాళ్లను ఆడిస్తామనన్నా వెధవగోలై పోయిందమ్మా! పైగా ఏమన్నా అంటే ఎదురు తిరగడం. ఆయన గారివత్తాసొకటి ముద్దులకూతురికి. ఎట్లన్నా ఏడవండి!' అని కేకలేసి విసురుగా ఇవతలికివచ్చింది పార్వతమ్మ. నిమ్మకు నీరెత్తినట్టు నిశ్చలంగా పడుకొంది విశాల. ఇవతలికివచ్చిన పార్వతమ్మ గడపలో చెప్పులచప్పుడు విని తలెత్తి చూసింది. ముఖకవళికల్ని క్షణంలో మార్చుకుంటూ 'రా, అన్నయ్యా' ఇదేనా రావడం? అంటూ పలకరించింది. 'ఏమిటమ్మాయ్ కేకలేస్తున్నావ్' అంటూ ప్రవేశించారు పరంధామయ్యగారు. మామయ్య మాట వినగానే పిల్లలంతా చుట్టుముట్టేరు. 'ఏమిటో అన్నయ్యా! ఈస్కూళ్ళకు సెలవులివ్వడంతో నాదుంప తెగిపోతోంది. విశాల ఏండ్లొచ్చేకొద్దీ మరీ శుద్ధమొద్దవతారం ఐపోతోంది. పిల్లలను కొట్టడం ఏడిపించడం. అదేమంటే నామీదికే వస్తోంది, చూడు. పొద్దుట్నుంచి అలిగి ఎలా పడుకొనుందో! దీనితో ఎలా వేగడమో తెలియకుండా ఉంది అన్నయ్యా!' అని చెప్పుకుపోతోంది. 'అదంతా వయసులో మార్పులు తెచ్చే సంరంభాన్ని తట్టుకోలేక చేసే అల్లరిలే అమ్మాయ్! పెండ్లి చేసేశామంటే అన్నీ అణిగిపోతయ్!' అని నవ్వుతూ గదిలోకి చూచి 'ఏమే! విశాలా!' అని పలుకరించారు పరంధామయ్య. 'ఏమి పెండ్లో అన్నయ్యా! పిల్ల చూడబోతే గున్నమావిలా ఎదుగుతోందా! ఆయన చూడబోతే ఏసంగతీ పట్టించుకోరు. దానిరాతెలాగుందో మరి!' పెండ్లిమాట ఎత్తేప్పటికి పార్వతమ్మ స్వరంలో గాద్గదికత ప్రవేశించింది.



చిత్రకారుడు : కలువకోలను సదానంద (పాకాల)

'దానికేమే బంగారంటి పిల్ల! ఎవరైనా కళ్ళకద్దుకు చేసుకుంటారు కొంచెం చురుకుపాలెక్కువనేగాని, చిదిమి దీపం పెట్టుకోవచ్చుకదే!' అని ఎందుకన్నా నా అమాట అని నాలిక్కరచుకొన్నారు పరంధామయ్యగారు.

పార్వతమ్మ సమయం జారవిడువలేకపోయింది.

'ఎవరో ఎందుకన్నయ్యా' మనరామ్మూర్తి ఉన్నాడుకదా! లక్షణంగా మేనరికం కావాలంటే నిన్నడ్డేదెవరన్నయ్యా' అంది.

'నీకు తెలీనట్టు అడుగుతావమ్మాయ్! నాదేముంది చెప్పు. ఏమన్నా అన్నానంటే 'గయ్' మని వస్తుంది మీవదిన. నామటుకు నాకు తప్పక చేసికోవాలనే ఉంది. రాముడి కూడ ఇష్టవే. ఏంజేస్తాం! మీవదినేమో! మొండిపట్టు పట్టుందాయెను' అన్నారు పరంధామయ్య.

'ఐనా వదిన అలా మాట్లాడ్డం భావ్యమేనా అన్నయ్యా! ఆ స్తిపాస్తులు శాశ్వతమా! సంబంధాలు చూసుకోవాలిగాని. వదిన కోరినంతకట్నం మేమెలా ఇవ్వగలం చెప్పు. ఆయన తెచ్చే జీతపురాళ్ళు కుటుంబపోషణకే చాలీచాలనిస్థితిలో ఉండె. ఇంతకూ 'ఎలాఉందో దానిరాత' అని కళ్ళనీళ్ళు పెటుకొంది పార్వతమ్మ.

'సరే, చూద్దాంలే అమ్మాయ్! నేనిలా వచ్చినసంగతి తెలిసినా ఎగిరి పడ్తుంది. దాన్నెలా ఒప్పించాలో అర్థమవడంలేదు. సాధ్యమైనంతవరకు చెప్పి చూస్తాను.' అని అన్నయ్య చెప్తోంటే పార్వతమ్మ ప్రాధేయపడుతోంది వదిన్నెలాగయినా ఒప్పించమని.

అంతా వింటున్న విశాల చప్పున లేచింది. 'ఆరోడ్డురోలరు బావను నేనేంచేసికోను. మీరెవ్వరూ అత్తయ్యను బ్రతిమాల నవసరం లేదు. ఇంతకు టీచరేగదా ఆయనచేయబోయేదే లేదు. పైగా తన్ని ఏడిపించడం!

ఉద్యోగం. ఇంతమాత్రపు సమ్మంధం ఇంకెక్కడా దొరక్కుండా పోదు. పెండ్లి కాకుంటే హాయిగా ఉద్యోగం చేసికొంటాను' అని చలచల వెళ్లిపోయింది విశాల.

'చూశావా అన్నయ్యా! దాని పొగరు. ఇలానే ఎదురు తిరుగుతోంటే ఎలా వేగేది చెప్పు. ఇంతకూ స్కూలు ఫైనలు పరీక్ష రాశాననేగదా దీనికీగర్వం. ఉద్యోగం చేసుకొంటుందట. ఉద్యోగం! హాయిగా బి.ఇడి. చదివి, హైస్కూల్లో మాస్టరుగా ఉండేవాణ్ణి అలాఅంటుందా! దీనినీల్గుడుకు ఆయన ఏకలెక్టరును తెస్తారో నేనూ చూస్తాగా! అవ్వ! అయినా ఇంతగర్వమా' అని నోరు నొక్కుకుంటూ విస్తుపోతోంది పార్వతమ్మ. 'పెండ్లయితే పొగరూ గిగరూ దేశంమీద పోతయ్‌లే అమ్మాయ్. ఆమూడు ముళ్లూ పడితే పొగరుబోతుకోడెకు ముకుదాడు పొడిచినట్లే. వెళ్ళొస్తానమ్మాయ్!' అంటూ ప్రయాణమయ్యాడు పరంధామయ్య కోడలిమాటలకు నవ్వుకొంటూ.

'అయ్యో! ఇప్పుడు వెళ్ళడమేమి టన్నాయ్! వంటయింది. భోంచేసి వెళ్దువుగాని' అని పార్వతమ్మ అంటున్నా 'ఎందుకమ్మా బస్సు ఉండనే ఉందిగా. అర్ధగంట ప్రయాణం నాకోసం కాచుకొనిఉంటారు.' అంటూ వెళ్లిపోయాడు పరంధామయ్య.

'ఏమిటో ఈ తండ్రీ కూతుళ్ళ ధైర్యం ఏమి చూసుకొనో వీరి అహంభావం. ఈమె చూడబోతే ఇట్లా. ఆయన చూడబోతే అట్లా. అసలే పట్టించుకోరు. నేనొకతెను దిగులుపడాల్సిందే.' అన్న మేలాపోయిందో ఏమిటో అనుకుంటూ వంటింటివేపు నడిచింది పార్వతమ్మ.

భర్త భోంచేసేప్పుడు అంతా చెపుతోంది పార్వతమ్మ. ప్రక్కనే కూచుని వింటోన్న విశాల 'ఏమిటి నాన్నా! ఆయనేమో భార్య నడగాలో అని ఇదవుతోంటే ఈమె ఎలాగైనా ఒప్పించన్నయ్యా అని ఏడుస్తోంది. నాకు మండిపోయి మీ రెవరూ బ్రతిమాల నవసరంలేదు. నేనా బావ నసలు చేసికోనన్నాను ఇది తప్పా నాన్నా?'

'లేదమ్మా! మా బాగా చెప్పావ్ లేకుంటే ఏమిటో దీని పిచ్చిగాని అంతఇష్టం లేనివారిని పట్టుకు ప్రాకులాడితే మాత్రం ఏం ప్రయోజనం చెప్పు. వాళ్ళకేదో గొప్ప ఆస్తిపాస్తులున్నాయని దీని ఆరాటం. నలుగురూ పంచుకుంటేగదా తేలేది.' అని ఆయన విసుక్కుంటుంటే 'ఇంతకూ మీ అబ్బా కూతుళ్ళొకటి. నేనొక్కదాన్నే పరాయిదాన్ని. చదివించొద్దో అంటే వినకుండా అలా నెత్తి కెక్కించుకున్నారు నామాట ఎవరికీ పట్టదు' అని కన్నీళ్ళు



పెట్టుకుంది పార్వతమ్మ................

'ఏమండీ, మీ చెల్లెలుగారింటికి వెళ్ళొచ్చారా! అసలు మీరు వెళ్ళకుండా ఎలా వస్తారులెండి!' అంటూ ఎదురుగా గుమ్మంలోనే స్వాగతం చెప్పింది భర్తకు లక్ష్మీదేవమ్మ.

'ఆ! ఏమి వెళ్ళడంలేవే, ప్లీడరుగారింటికి వెళ్ళాలంటే అట్టేగా వెళ్ళాలి. సరిగ్గా వీధి గుమ్మంలోనే అమ్మాయి నిల్చునుంటే తలొంచుకొని ఎలా వెళ్ళేది? పోయి పది నిముషాలైనా కాకముందే బయలుదేరి వచ్చేశాను' అని కుంచించుకుపోతూనే సమాధానం చెప్పారు పరంధామయ్య కోటువిప్పి స్టాండుకు తగిలిస్తూ.

'ఆహా! అయితే వెళ్ళొచ్చారన్నమాట. నేనప్పుడే అనుకొన్నానులెండి. మీకెలాగైనా ఆ నాపసానిని కోడలుగా తెచ్చుకోవాల్నుంది. మీరూ మీ చెల్లెలూ కలిసి ఏదో కుట్రలు పన్నే ఉంటారులెండి.! పాపం, ఏమంటోంది ఆ వంగనాచి చెల్లెలు!' అని అభినయిస్తూ ప్రశ్నించినది లక్ష్మీదేవమ్మ.

'ఆ, చెల్లెలేమంటుందే నీ పిచ్చిగాని, ఆ తల్లి అమాయకురాలు. ఒక్కటే ఏడుస్తోంది. ఈ ఇంట్లో నాకెంత స్వతంత్రముందో ఆ యింట్లో దానికీ అంతేగద! మా ఇద్దరికీ ఒకే కంచెలో వ్రాసినట్లున్నాడా బ్రహ్మ. ఐనా నేనింకా ఏమో అనుకొన్నానుగాని నీవన్నదే అక్షరాలా నిజమయ్యేట్టుందేవ్. ఆ కోడలుపిల్ల ఎన్నెన్ని మాటలడిగిందని. అబ్బో! అబ్బో! ఆ సంబంధం తప్పిపోబట్టె సరిపోయిందిగాని లేకుంటే నిన్నూ నన్నూ కూడ గుంజ కిడ్చి కట్టేదే అది!'

'ఐతే! మీకూ తెలిసొచ్చిందన్నమాట. ఏమందేమిటండీ. ఇంతకూ జరిగిన సంగతులు చెప్పకుండా ఏమిటండీ సోది!' ఆతురతగా ప్రశ్నించింది లక్ష్మీదేవమ్మ

'ఆ! ఏముందే! దాన్నో ఎమ్. బి. బి. ఎస్. చదివే కుఱ్ఱాడు చూచి వరించి దమ్మిడీకట్నం లేకుండా పెండ్లికి వప్పుకున్నాట్ట. ముహూర్తాలు పెట్టుకోవడమే తరువాయిట. ఈ సంగతి చెప్పి 'అబ్బా కూతుళ్లు నామాటేమైన పడనిస్తారా!' అని చెల్లెలు ఒక్కటే ఏడుస్తోంటే ఆ పిల్ల అన్నమాటలు గాదు. నీ కొడుకో రోడ్డురోలరట. నీవో రుబ్బుడు పత్రానివ. నిన్ను లేవదీయాలంటే కొండిమాన్లతో పట్టాల్సొందేనట. తను అదృష్టవంతురాలవటంవల్లే మన సంబంధం తప్పిపోయిందట. ఇక అయిదువేలుగాగు పదివేలిచ్చే సంబంధంచూసి చేసుకోమని రుబ్బుడు పత్రం అత్తయ్యతో చెప్పమని చెప్పింది విన లేక చక్కా వచ్చేను. దాని వికవికలు గావు, పకపకలు గావు. మనకాపిల్ల వద్దో అని నువ్వంటుంటే విననందుకు నాకు మంచి ప్రాయశ్చిత్తమే జరిగింది!' అని ముగించారు పరంధామయ్యగారు; భార్యముఖంలో మార్పులు పరిశీలిస్తూ.

రోడ్డు రోలరు-ఇంజను-

"ఆ! ఎవిఁటే! నిన్నగాక మొన్న నాకళ్ళెదుట పుట్టి కళ్ళుదెరిచిన పిల్ల! దానికింత పొగరా! నిన్న మొన్నటిదాకా గతిమాలి నా చుట్టూ తిరిగారే కోడల్నిగా చేసుకోమని. ఇంతలోకే కళ్ళు నెత్తికొచ్చాయా! పైగా నన్నే మాటలనడమా! చూస్తాను! దాని తడాఖా! మంచి రోజెప్పుడో చూడండి. ఆ! మంచి రోజేమిటిలెండి! మధ్యాహ్నమే ప్రయాణం. భోజనం త్వరగా కానివ్వండి. మీరుగూడ నావెంట రావాలి. మన్నిగాదని పరాయివాళ్ళకెలా యిస్తారో అదీ చూస్తాను." అని గది గుమ్మంకేసి నడిచి 'ఒరే అబ్బాయ్' అని పిలిచింది. లక్ష్మీదేవమ్మ అంతవరకూ గదిలో కూర్చొని సంభాషణంతా చెవులు దొరగించి వింటూన్న రామ్మూర్తి ఏమీ తెలియని వాడ్లా 'ఏవమ్మా' అంటూ వచ్చేడు.

'విశాలను చేసికోడానికి నీకేమి అభ్యంతరం లేదుగదూ!' అంది. అమ్మ అలా ఎందుకడుగుతోందో తెలియని రామ్మూర్తి తెల్లమొగం వేసేడు. ఆమె జవాబు కొదుచూడకుండానే 'నిన్నడిగేదేమిట్లే! నీ మొగం చూస్తేనే తెలియటంలా' అని భర్తవైపై 'ఎలాగైనా అది నాకోడలుగా రావాలి. దానిసంగతి చూడాలి. నామాటకు తిరుగంటూ లేదు. లేవండి భోజనానికి' అంటూ భర్తను త్వరపెట్టింది లక్ష్మీదేవమ్మ.

ఐదువేలు కట్నమిస్తే తప్ప తన గడపత్రొక్కనవసరంలేదని ప్రతిజ్ఞచేసిన వదిన తనంతట తానేవచ్చి పిల్లనిమ్మని ఎందుకడిగిందో! ఆయన మీరడిగిన కట్నంలో పదోవంతైనా మేమివ్వలేమని నిక్కచ్చిగా చెప్పేసినా కట్నం లేకుండానే పెండ్లికి ఎందుకొప్పుకుందో పాపం పార్వతమ్మకు ఎంత తల బ్రద్దలుగొట్టుకున్నా అర్థమవలేదు. ఇంతదగ్గర ముహూర్తం కుదిరిందెలాగో ననుకుంటూ ఆమె పెండ్లిపనుల సంరంభంలో మునిగిపోయింది.

భిక్షుకి-చంటిపిల్లకు పొద్దుటినించిపాలు లేవు, బాబూ?

పెద్దమనిషి—నాదగ్గర పాలు లేవు, పో.

బి. రాజేశ్వర మూర్తి (చిలకలపూడ)

ఆ రాత్రి శోభనపురాత్రి.

ముత్తైగువుల సందడంతా తలుపుదగ్గరే ఆగిపోయింది. విశాలను బలవంతంగా లోపలికి నెట్టి తలుపుమూసి గొళ్ళెంపెట్టి అందర్నీ వెళ్ళిపొమ్మని చెబుతోంది విశాలతల్లి.

విశాల సిగ్గుతో తలుపు దగ్గరే నిల్చొని వ్రేళ్లతో చీరను మెలిపెడుతోంది. ఒక్కసారి తలెత్తిచూసి దించుకొంది. బుష్‌షర్ట్‌తో బావ యెంతో అందంగా కనిపించేడు. 'కొంచెం లావైతేమాత్రం మాబావకేం మారాజా!' అనుకొంది విశాల.

తలుపు దగ్గర సందడి పూర్తిగా సర్దుకొన్నాక రామ్మూర్తి లేచి అప్సరసలాగా అలంకరించిన విశాలను తదేకంగా చూస్తూ సమీపించేడు.

విశాల మరీ సిగ్గుతో కుంచించుకపోయింది.

'ఏం! మరీ, అంతగా సిగ్గుపడుతున్నావ్! విశాలా! నేను ఎప్పటి రోడ్డురోలరు బావనేగా! మానాన్న కష్టపడి ఈ సుతిమెత్తని ఇంజన్ను అంటగట్టేడు. ఎలా భరిస్తావో ఏమిటో' అంటూ వెనకనించీ విశాల రెండు భుజాలమీద చేతులువేసి ముందుకు నడిపిస్తూ పాన్పుదగ్గిరికి తీసుకుపోయాడు.

విశాల కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆరోజు అమ్మమీదికోపంతో మామయ్యతో అన్నమాటలన్నీ బావకు చెప్పాడుగాబోలు ననుకొంది. మామయ్యమీద ఎక్కడలేని కోపమూ వచ్చేసింది.

"ఏం! విశాలా పలుకవు!" అంటూ గడ్డం పట్టుకొని ముఖాన్ని పైకెత్తి చూసిన రామ్మూర్తి ఆశ్చర్యపోయేడు.

"ఇంతమాత్రానికేనా విశాలా! ఏడుస్తావెందుకు. నిన్నేమన్నానని..' అంటూ దగ్గిరికి తీసుకున్నాడు రామ్మూర్తి. విశాల అతని కౌగిట్లో కరిగిపోతూ "నేనలా అనాలని అన్లేను. అమ్మ మీద కోపంగా ఉండి...' ఏదో చెప్పబోయింది విశాల.

"పిచ్చిదానా! నీవలా అనబట్టే మన పెండ్లి ఇంతత్వరగా అయిందని నీకు తెలుసా!" అని సున్నితంగా ఆమెవీపు నిమురుతూ జరిగిన సంగతంతా చెప్పేసేడు రామ్మూర్తి.

మరునాడు గదిలో దేవుడిముందు కూర్చొని భగవద్గీత పారాయణం చేస్తోన్న పరంధామయ్య, కొడుకూ కోడలూ కలిసికట్టుగా వచ్చి తన పాదాలకు నమస్కరించేసరికి ఆశ్చర్యపోయినా కళ్ళద్దాల్లోంచి వారిద్దరివంకా చూసి క్షణంలో సంగతి గ్రహించేసి చిఱునవ్వునవ్వుతూ "శీఘ్రమే ఒక చిన్న రోడ్డురోలరు ప్రాప్తిరస్తు" అని దీవించేరు. నిండుహృదయంతో దంపతులిద్దరూ తెల్లబోయి ఒకరిముఖం ఒకరు చూసుకుని నవ్వుకుంటూ వెళ్లిపోయేరు. ★